## క్లుప్తంగా

### ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

• డీఎల్‌డీఓ నారాయణమూర్తి



హౌసింగ్ లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ తదితరులు

**సామర్లకోట:** స్థానిక జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న వాటిని వేగంగా పూర్తిచేయాలని డీఎల్‌డీఓ పి. నారాయణ మూర్తి అన్నారు. ఆదివారం స్థానిక మెప్మా కార్యాలయంలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు కావలసిన అవసరాలను తెలియజేస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఆయా దశలకు సంబంధించి అడ్వాన్సులుగా రూ.20 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇసుక ఉచితంగా ఇస్తామని తెలిపారు. డీఎల్‌పీఓ ప్రసాద్, హౌసింగ్ డీఈ రాజు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

### దాసరి సేవలు అభినందనీయం



పోస్టల్ ఎస్పీ దాసరిని సత్కరిస్తున్న తపాలా ఉద్యోగులు

**పెద్దాపురం:** జిల్లాలో పోస్టల్ సూపరిండెంట్ దాసరి సూర్య నాగేశ్వరరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఇటీవల పదోన్నతిపై విశాఖ బదిలీపై వెళ్లుతున్న ఆయనకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో వీడ్కోలు సభ నిర్వహించాచు. డివిజన్ ఏఎస్పీ సీహెచ్ శ్రీనివాస్, సామర్లకోట సబ్ డివిజన్ ఏఎస్పీ ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ సాటి ఉద్యోగులతో సమభావంగా మెలగిన ఘనత దాసరికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో చైతన్య, అమ్మిరాజు, అడ్డగర్ల సురేంద్రనాథ్, స్వామిజీ, శంకర్, చింతా భద్రరావు, పొన్నాడ సత్య గంగాధర్, రామ్మూర్తి, భూలోకం, త్రిమూర్తులు, నాగార్జున, సత్యనారాయణ, సీహెచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎం.వీరమణి



ఎస్.రాజా

**సామర్లకోట:** యూటీఎఫ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగింది. రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాహ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.నగేష్, సీనియర్ నాయకులు జి ప్రభాకర్, గిరిధరగోపాలరావు ఆధ్వర్యంలో పట్టణ శాఖ నూతన కమిటీ అధ్యక్షురాలిగా ఎం.వీరమణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వజ్రపు మహేష్, పర్యవేక్షణ అధికారిగా ఎస్ వీరబాబు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, కోశాధికారిగా కె.శ్రీనివాసు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ సైపుల్లా, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎ.శైలజ, కార్యదర్శులుగా పి. కాశీవిశ్వనాథం, కె.జగదీశ్వరరావు, ఆర్.గణేష్, జె.ప్రవీణ, ఎస్.నిర్మల, డి సూర్యనారాయణ, వై.గురుప్రకాశరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎం నాగేశ్వరరావు, జి.బేబీరాణి, కేఎస్ శేఖరం ఎన్నికఅయ్యారు.

### నిందితులను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

**గండేపల్లి:** పశువులను తీసుకుపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తులను గ్రామస్తులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని తాళ్లూరు శివారులో ఇంటి ముందు కట్టి ఉన్న గేదెను ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు తీసుకుపోయేందుకు ప్రయత్నించారు. వీరిని స్థానికులు పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. కాగా గతంలోనూ ట్రాక్టర్ బ్యాటరీలు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు ఆరుగొల్లు మోసి తెలిపారు.

### వైభవంగా స్వామివారి కల్యాణం

**జగ్గంపేట:** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రామానుజ ప్రియగోవర్ధన కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో 130 మంది దంపతులు పాల్గొన్నారు. త్రిదండి చిన జీయర్ స్వామివారి మంగళాశాసనములతో శ్రీమాన్ పరాశర రఘునాథ్ బట్టర్ స్వామి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, సంఘ నేతలు కొత్త భైరవకృష్ణ పాల్గొన్నారు.

# నేతన్నకు నిజమైన నేస్తం

• జాతీయోద్యమ స్ఫూర్తితో నేతన్నకు బాసట
• చేనేత రంగానికి అండగా ప్రభుత్వ పథకాలు
• నేడు జాతీయ చేనేత దినోత్సవం



విలసవిల్లిలో చేనేత చెల్లెమ్మకు హామీ ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

**పెద్దాపురం:** చేనేత అంటే కేవలం వృత్తి మాత్రమే కాదు. అది జాతీయోద్యమ స్ఫూర్తి. మన సాంస్కృతిక వారసత్వం సందర్భంగా చేనేత ప్రధాన భూమికను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విదేశీ వస్త్ర బహిష్కరణ లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చింది. సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన వంతుగా చేనేత రంగం అభివృద్ధికి వేసిన బాటలు పరిశీలిస్తే..

**నాన్న ఆశయంతో నేతన్న నేస్తం**

మహానేత వైఎస్సార్ తనయుడిగా నాన్న ఆశయం కోసం నేతన్నలకు అండగా నిలిచారు. 2018 పాదయాత్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో చేనేత చెల్లెమ్మ వెంకటలక్ష్మి కోరిక మేరకు ఆమె ఇంటికి వెళ్లి చేనేత మగ్గాన్ని పరిశీలించారు. నేతన్నలు కన్నీళ్లు చూసి చలించి అధికారంలోకి రాగానే 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకాన్ని అమలులోకి తీసుకువచ్చి ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందు కోసం రూ.200 కోట్లు కేటాయించారు.

**తగిన నిధులు కేటాయించాలి**



చేనేత రంగాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లలో తగిన నిధులు కేటాయించాలి. చేనేత వస్త్రాల అమ్మకాలు ఏటా సుమారు రూ.50 కోట్లు మాత్రమే. చేనేత సహకార సంఘాల ద్వారా విక్రయించే దుస్తులపై 30 శాతం రిబేటు ఇచ్చేందుకు వీలు కల్పించాలి.

– ముప్పన వీర్రాజు, చేనేత రంగ నిపుణులు, పెద్దాపురం

**ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది**



చేనేత రంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. గత నెలలో నేతన్న నేస్తం కింద రూ.196 కోట్లు విడుదల చేసి 81 వేల మందికి సొమ్ములు అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది

– దవులూరి దొరబాబు, హౌసింగ్ చైర్మన్, పెద్దాపురం

# రత్నగిరిపై అలరించిన కళా ప్రదర్శనలు



థింసా నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

**అన్నవరం:** సత్యదేవుని సన్నిధిలో ధర్మ ప్రచార మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కేరళ డప్పులు, థింసా నృత్యం, కోలాటం, హరిదాసు, గంగిరెద్దుల వాళ్లు తదితరులు తమ కళా ప్రదర్శనలతో అందరినీ అలరించారు. కాగా ఈ కార్యక్రమానికి వచ్చిన దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు సహస్ర దీపాలంకార మందిరంలో సత్యదేవుని వ్రతమాచరించారు. పండితులు ఛామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు మంత్రికి వ్రతకథను వివరించారు.



కాళికా నృత్యంలో భాగంగా అమ్మవారికి ధూపం వేస్తున్న దృశ్యం

# నవరత్నాలతో నవశకం



కొత్తపల్లిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

• ఎమ్మెల్యే దొరబాబు
• కొత్తపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

**కొత్తపల్లి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల అమలుతో నూతన శకానికి నాంది పలికారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్తపల్లి రవీంద్రపురంలో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్ పెన్షన్ అందుతున్న తీరుపై వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. సొంత కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలో కనీవిని ఎరుగని రీతిలో గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని గుర్తు చేశారు. అటువంటి ఇబ్బందులు లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే కాకుండా వారికి కలిగిన లబ్ధి ధైర్యంగా వివరిస్తున్నామని ఎమ్మెల్యే దొరబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర భవానీ, సచివాలయాల కన్వీనర్ సానా నాగు, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గింజల శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల శ్రమదానం



ప్రత్తిపాడులో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

**ప్రత్తిపాడు:** స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదాన ప్రాంతాన్ని శుభ్రం చేశారు. పాఠశాలకు సెలవు కావడంతో విద్యార్థులంతా పలుగు, పార చేతబట్టి ఆవరణలో భారీగా పెరిగిపోయిన తుప్పలను తొలగించారు. వసతిగృహ ఆవరణలోని చెత్త, వ్యర్థాలను తొలగించారు. విద్యార్థుల శ్రమదానాన్ని వసతి గృహ సంక్షేమాధికారి ఎం.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ అంశాలపై అవగాహన పెంచుకోవాలి

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

**తుని:** విద్యతో పాటు జాతీయ అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. తుని రైల్వేస్టేషన్ అమృత్ భారత్ పథకానికి ఎంపికైన విషయం పాఠకులకు తెలిసిందే. విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులకు రోహన్ మధుకర్, భవ్య, కృష్ణచందన ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులను రైల్వే నోడల్ అధికారి మునిరెడ్డి, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, ప్రధానోపాధ్యాయురాలు సీతారాణి తదితరులు అభినందించారు.

## పుస్తకావిష్కరణ

**కాకినాడ కల్చరల్:** స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత రెంటాల వేంకటేశ్వరావు రచించిన ఒకసారి ఆలోచిద్దామా పుస్తక పరిచయ సభ ఆదివారం సాయంత్రం డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా రెంటాల రాసిన ఒకసారి ఆలోచిద్దామా పుస్తకాన్ని శ్రీమధునా పంతుల సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. తదుపరి రెంటాల అనువాద పుస్తకం 'అట్లాస్ ష్రగ్డ్' నవలపై జోస్యుల ప్రసంగించారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

• ఎమ్మెల్యే పెండెం దొరబాబు



రవీంద్రపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

**కొత్తపల్లి:** గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక రవీంద్రపురంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. పేదల జీవన శైలిలో మార్పులు తీసుకురావడం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర భవాని, సచివాలయ కన్వీనర్ సానా నాగు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మరిడమ్మ జాతర

• భారీ అన్నసమారాధన..
• వేల సంఖ్యలో భక్తుల హాజరు



ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధన ప్రారంభిస్తున్న చైర్మన్

**పెద్దాపురం:** ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఏటా శ్రావణ మాసం ఆరంభంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. వేల సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు సుమారు నాలుగు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. జాతర తాత్కాలిక కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు.

# నేత్రపర్వంగా హనుమ కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

**సామర్లకోట:** స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. ఆలయంలో ఏర్పాటు చేసిన హనుమాన్ చాలీసా పారాయణం ముగింపును పురస్కరించుకొని కల్యాణం ఏర్పాటు చేశారు. పెద్దాపురం ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ఈ పారాయణం నిర్వహించిన విషయం విదితమే. విజయవాడ విజయ రాజరాజేశ్వరి విద్యా పీఠాధిపతి వాసుదేవానంద గిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సువర్చలా ఆంజనేయ కల్యాణం తిలకించడానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఇటువంటి కల్యాణం అరుదుగా జరడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వాసవీ వనితా క్లబ్, వాసవీ యుత్‌కు చెందిన ప్రతినిధులు కటకం కృష్ణ సుజన్, కటకం సతీష్ కంచర్ల మల్లిబాబు, కుసుమంచి శేషగిరిరావు, కంచర్ల భాగ్యలక్ష్మి, కటకం శ్రీరామచంద్రమూర్తి, పూరా సత్యనారాయణ, కటకం త్రినాథరావు, కటకం సుమలత, జీవీకె మోహన్ రావు భక్తులకు సేవలందించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పారాయణం చేసిన జన మండలి మహిళా సభ్యులను మల్లికార్జున స్వామి సత్కరించారు.



ఆలయంలో నిర్వహించిన సువర్చలా సమేత ఆంజనేస్వామి కల్యాణం

## మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

• జీవనోపాధుల మిషన్ సీఈఓ అనిల్‌శర్మ



వేట్లపాలెంలో వ్యాపార సంస్థలను పరిశీలించిన హిమాచల్‌ప్రదేశ్ అధికారులు

**సామర్లకోట:** మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర జీవనోపాధుల మిషన్ సీఈఓ అనిల్‌శర్మ, స్టేట్ ప్రాజెక్టు మేనేజరు రాజిత్‌వర్మ అన్నారు. మండల పరిధిలో వేట్లపాలెంలో మహిళలు చేస్తున్న వ్యాపారాలను ఆదివారం వారు పరిశీలించారు. డీఆర్‌డీఏ, స్త్రీ నిధి ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న గ్రేస్ బొటిక్, దోస్తీ టిఫిన్ సెంటర్, పాల డెయిరీ యూనిట్లను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేట్లపాలెంలో బొటిక్ (ఫ్యాషన్ డిజైన్ సెంటర్)ను 2020లో ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం రూ.20 లక్షల టర్నోవర్‌తో లాభసాటిగా నడుస్తోందని, నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, డీఆర్‌డీఏ డీపీఎంలు బి.వెంకటేశ్వరరావు, ఎ.కేశవ్, స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం బి ప్రశాంతి, సీసీలు పాల్గొన్నారు.

## ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

• లివర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి
• దాతల సహాయం కోరుతున్న కుటుంబ సభ్యులు



ఏవీ నగరంలో లివర్ వ్యాధితో బాధ పడుతున్న కొంజర్ల కృష్ణ

**తొండంగి:** చిరువ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అతని జీవితంలోకి లివర్‌వ్యాధి పిడుగులా వచ్చింది. దీంతో వైద్యం కోసం అప్పుల పాలై చివరకు మంచాన్ని పట్టాడు. వైద్యులు లివర్ మార్పిడికి రూ.25 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో దాతల ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. వివరాల్లోకి వెళితే... తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన కొంజర్ల కృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుదిరితే కూలి పని, అప్పుడప్పుడు ధాన్యం వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా లివర్ దెబ్బతిందని వైద్యులు నిర్ధారించారు. లివర్ మార్పిడి చేయాలని తెలిపారు. దీనికి రూ.25 లక్షలు ఖర్చవుతుందని తెలపడంతో ఆ కుటుంబానికి ఏమి చేయాలో పాలుపోలేదు. ఇప్పటికే వైద్యం కోసం ఉన్నదంతా ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోయిన ఆ కుటుంబానికి వేరోక మార్గం లేక దాతల సహాయం కోరుతున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు సమకూరుతుండగా మిగిలిన రూ.15 లక్షల కోసం దాతల సహాయం కోరుతున్నట్టు కృష్ణ భార్య లక్ష్మి తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా కొందరు దాతలు ఆర్థిక సహాయం అందించినప్పటికీ వైద్యానికి డబ్బులు సరిపోని పరిస్థితి నెలకొంది. సహాయం చేసే దాతలు బ్యాంకు అకౌంట్ నంబర్ 0623101013138 (కెనరా బ్యాంకు ఏవీ నగరం బ్రాంచ్) లేదా 79818 16770 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని బాధితుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.